అబ్బాయి సైకిలురిక్షాలో కూర్చున్నాడు పుస్తకాలసంచి బుజాన వేసుకుని ఆ ఐస్ ఫ్రూట్ అమ్మే కుర్రాడూ, మా వాడూ యిద్దరూ ఒకే యీడువాళ్లు నా ఆలోచన అన్నీ పూర్తి అయేటప్పటికీ, మా ఆవిడ ముస్తాబు చేసింది కొడుకుని. అప్పుడే రిక్షా పిలవటం, అందులో వాడిని కూర్చోపెట్టటం, అన్నీ జరిగిపోయినాయి. స్కూలు మా యింటికి అర మైలు దూరం

ఆ ఐస్ ఫ్రూట్ కుర్రాడు ఎటులేదన్నా అయిదారు మైళ్ళు నడుస్తాడు రోజుకి కనీసం. నిప్పులు చెరుగుతున్నా, పిడుగులు పడుతున్నా నడవక తప్పదు. కాళ్ళకి చెప్పులుండవు. నెత్తిన గొడుగుండదు మా వాడు అర మైలు దూరానికి సైకిలు రిక్షా ఎక్కుతాడు ఇవి కాక పదిరూపాయలు ఖరీదుచేసే బూట్లు విలువైన తోలు సంచీలో పుస్తకాలు. మూడో క్లాసుకే ఫౌంటెన్ పెన్ను! ఇద్దరిమధ్యా ఎంత అగాధం!

స్కెచ్

# నేరము—శిక్ష

అడుసుమల్లి బాస్కర్

హాస్టలంతా చాలా ప్రశాంతంగా ఉంది.

మాంచి బంగళాలలో అందమైన గదుల్లో ఆనందంగా నిద్రిస్తున్నారు విద్యార్థులు. కటిక నేలమీద మెత్తటి పరుపుమీద కొందరు. చెప్పినట్లు వినే మంచంమీద చక్కగా నిద్రిస్తున్న వారు కొందరు, ఎవరికేది వీలుగా ఉంటే ఆ విధంగా నిద్రిస్తున్న వారితో హాస్టలు కీచురాయి గోల వినపడేంత నిశ్శబ్దంలో ఉంది అక్కడక్కడ రూముల్లో లైట్లు ఇంకా వెలుగుతూనే ఉన్నాయి వారు పుస్తకాలని విడవలేని వీరుల్లా రాత్రి పన్నెండు అని గంటస్తంభం రొద పెడుతూన్నా నిశ్చలంగా చదువుకుని పోతున్నారు అంత నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అప్పుడప్పుడు ప్రక్కనున్న పిచ్చాసుపత్రిలో కొందరి అల్లరి, హాయిగా గొంతెత్తి పాడుతూన్న నక్కల రాగాలు విన్పిస్తున్నాయి.

ఆకాశం విరిగి మీదపడ్డట్టు ఒక్కసారిగా "దొంగ దొంగ" అనే అరుపు హాస్టలంతా మ్రోగింది వెంటనే చాలామంది లేచారు—ఆ అరుపు వినపడ్డవైపు పోయారు. ఒక మనిషి మాసిన నిక్కరు, చొక్కా, గడ్డముతో తెల్ల ముఖం వేసి నిల్చున్నాడు. వాని ముందు ఈ విద్యార్థి సమూహం గుడ్లెర్రచేసి చూస్తూ నిల్చున్నారు. కొద్దిసేపు నిశ్శబ్దంగా గడిచింది.

"ఎవరు నువ్వు! ఎందుకొచ్చా విక్కడికి?" అని ఒక విద్యార్థి ప్రశ్నించాడు.

దానికి సమాధానం ఏమీ రాలేదు.

"నీకేంపని? ఇంత రాత్రివేళ నీవిక్కడికొచ్చి ఏంచేదామనుకున్నావు?" అంది ఇంకో కంఠం.

దీనికీ ఏమీ సమాధానం లేదు.

"చెప్తావా చెప్పవా?"గర్జించాడింకోడు.

దానికీ సమాధానం లేదు.

"దొంగ వెధవ – సమాధానం చెప్పడు. ఆ ముఖం చూడండిరా! దొంగముఖం–ఏదీ కర్ర పట్రారా" అన్నాడింకొక శూరుడు.

నిముషాలు గడిచాయి గాని, ఆ మనిషి మాట్లాడలేదు మూగ ఏమో అనుకుంటే ముఖంలో ఏ విధమైన మార్పు లేదు. చెవుడు కూడా అనుకున్నారంతా "వాడు ఇంతధైర్యంతో వచ్చి దొంగ వేషాలు వేస్తున్నాడు" అని అందరూ అభిప్రాయపడ్డారు. కొట్టినా తిట్టినా లాభం ఉండేట్టు లేదు. "భయపడేరకం మల్లే లేదు–చాలా అలవాటుపడ్డ దొంగ" అని అనుకుని మూకుమ్మడిగా అందరు వాడిని బజాయించారు. దెబ్బలుతిన్నా "కిమన్నాస్తి" మాట మాటాడలా! ముఖంలోగూడా మార్పురాలా! ఆశ్చర్యం! ఇంత విధ్యాధికమైన బుర్రలకి పాలుపోలా దాని కారణం తికమకపడ్డారు. కొట్టేందుకు ఓపికతగ్గి పోలీసునుపిలిపించారు. మనిషిని

చూపారు. దొంగని జైల్లో పెట్టుకున్నారు.

వాడితో ఐదు నిముషాలు చూచాడు పోలీసు పరకాయించి. "వాడిని దెబ్బలు కొట్టారా?" అన్నాడు.

"ఎంతకీ మాట్లాడకపోతే రెండు వేశాం" అన్నాడో భూగర్భశాస్త్ర విద్యార్థి—కొట్టినవి అందరు కలిపి రెండు వందలో, రెండు వేలో దెబ్బలు నిజానికి కాని చెప్పిన సంఖ్య రెండు. ఎంత ఆశ్చర్యం? "మనిషి ఎప్పుడు పుట్టింది మొదటి సారిగా?" అని అతన్ని ప్రశ్నిస్తే- "ఆ! ఎంతండీ—రెండు వేల మిలియన్ల సంవత్సరాల క్రితం" అన్నాడు-అంత చోద్యంగా ఉందీ సమాధానం.

"అయితే నన్నెందుకు పిలిచారు?" అన్నాడు పోలీసు కానిస్టేబిలు.

"అదేం ప్రశ్న? వాడిని పట్టించాము! వాడు దొంగ!" అన్నారంతా.

"వాడేం దొంగతనం చేశాడు?" అన్నాడు పోలీసు.

"కొద్దిలో చేసేవాడే. పట్టుకున్నాం గాని" అన్నారంతా.

"దొంగతనం చేయకుండా దొంగ ఎట్లా అయ్యాడు? దెబ్బలెట్లా తిన్నాడు?" అన్నాడు పోలీసు

"ఇదేం ప్రశ్న? వాడొచ్చిన పని అది!"

"అదెట్లా తెలుసు మీకు?" మొండిగా అన్నాడు పోలీసు.

"మనిషిని చూస్తే తెలియడంలేదా?"

"మనిషిని చూస్తే దొంగని తెలీటంలా! పిచ్చి వాడని తెలుస్తోంది!" అన్నాడు పోలీసు నిబ్బరంగా. పచ్చి వెలక్కాయ మింగినట్లయిందీ విద్యార్థులకు. మాట ఏమి చెప్పడానికీ వారికి పాలుపోలేదు!

"మీరు ఈ పిచ్చివాడిని నిజానిజాలు తెలుసుకోకుండా దారుణంగా హింసించారు. మీరు కొట్టినవి రెండువందలో రెండువేలో దెబ్బ లయ్యుంటాయి. ఈ మనిషిని చూస్తేనే తెలుస్తోంది ఇతని ప్రాణానికేమి అపాయమొచ్చినా మీరంతా శిక్షార్హులు. పాపం మాటాడనైనా లేనివాని నెంతగా హింసించారు?" అంటూ అతన్ని తీసుకుపోయాడు

నిర్దయతో తాము చేసినపనికి అందరూ దుఃఖించారు! తాము మానవులమా అని ప్రశ్నించుకున్నారు ఆ పిచ్చివాడు విపరీతముగా దేహబాధవల్ల జ్వరపీడితుడుగా ఉన్నాడన్న సంగతి విని చూడామనుకుని, సిగ్గుపడి బాధపడ్డారు.

నాల్గురోజుల తరువాత మళ్లా ఎర్రటోపీ ప్రత్యక్షమైంది హాస్టలులో. అన్ని కళ్లు ఆ దృశ్యం చూస్తూ తెల్లబడ్డాయి. చల్లగా చెప్పాడు పిచ్చివాని చావు కబురు ఒక్క నిముషంమాత్రం అందరివంకా చూచాడు తిన్నగా వెనుదిరిగి పోయాడు వచ్చినదారినే!

దయామయులుకొందరు ధైర్యంచేసి ఆ నిర్జీవంగాపడున్న భౌతిక దేహాన్ని చూడటానికి వెళ్ళారు. అంతే! ఒక్కరూ కన్నీరులేకుండా తిరిగిరాలేదు వాడు చేయనితప్పిదానికి హింసింపబడినందుకు, వీరు చూపే సానుభూతి ఒక్కొక్కగా నొక్క కన్నీటిచుక్క, ఒక్క క్షణకాలం నిశ్శబ్దం. అంతే మానవుడి విలువ!

కేసయింది దొంగగా వచ్చినందుకు కొట్టామనీ, వాడు మాటాడక పోబట్టి నిజానిజాలు తెలియలేదనీ విద్యార్థుల తరఫువారి వాదన

పోలీసు చెప్పాడు- వాడు సమాధానం చెప్పడంచెప్పకపోవడం వాడిచేతిలోపనిగాదు- అది వాడికి ఉన్న పిచ్చివల్ల అది వాడికర్మ! పోగా, వాడు ఏవస్తువూ దొంగిలించనప్పుడు వాడు దెబ్బలు తినడానికి అర్హుడూగాడు. కొట్టడానికి వీరికి అర్హతా లేదు.

రెండు వాదనలు విన్నాడు జడ్జీ దొంగగా అంతరాత్రిపూట వారి హాస్టలులో జొరబడిన వాడినుండి రక్షించుకోవడం తప్పా లేక పిచ్చివానినిగా చేసి, వానిలో ఏదో భావాలు ప్రేరేపింపజేసి, మానవునకు అందరాని ఊహాగానాల్లో తేల్చి వాడికిమాటలలో మాధుర్యం, మర్మం తెలీకుండా చేసి, వాడిని ఎక్కడెక్కడికో తీసుకెళ్ళి కీడు ఆపాదింపచేసిన ఆ భగవంతుడిదో తప్పు తేల్చుకోలేకపోయాడు! ఏది న్యాయమో తెలియలేదు జడ్జీకి

ఇంతకీ తప్పెవరిదో తేలలేదు